## క్లుప్తంగా

### దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు కేవీ రమణ

**ఏలూరు (టూటౌన్):** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఈ నెల 20న నిర్వహించనున్నారని, ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులు హరించే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్మిక వర్గానికి కూటమి ప్రభు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సహాయ కార్యదర్శి ఈమని కృష్ణకుమార్, మామిడి దాన వరప్రసాద్ పాల్గొన్నారు.

### అంజుమన్ సేవలు అభినందనీయం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అంజుమన్ ప్రతినిధులు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** నగరానికి చెందిన ప్రతిష్టాత్మక ముస్లిం సంస్థ అంజుమన్ ముహఫిజుల్ ఇస్లాం సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న అంజుమన్ హాలులో అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఖత్నా (సున్తీ) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అంజుమన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్షుడు ఎండీ జబీవుల్లా, రాజా అహ్మద్, ఎండీ ఇలియాస్ పాషా, రియాజ్ ఆలీఖాన్, ఎండీ అహ్మదుల్లా, ఎస్‌కే సిరాజ్ భాషా, ఎండీ ఇక్బాల్, ఎస్‌కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### లెప్రసీ బాధితులకు ఆహారం అందజేత

**దెందులూరు:** బాధితులు సేవ దేవుని సేవతో సమానమని ఏపీ ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పల్లెం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం హనుమాన్ నగర్ లెప్రసీ కాలనీలో 70 మంది లెప్రసీ బాధితులకు బిర్యానీ, పండ్లు అందజేశారు. దీర్ఘకాలిక బాధితులకు దాతలు స్వచ్ఛంద సంస్థలు తమ ఉదారత దాతృత్వాన్ని చాటుకోవాలని ఆయన కోరారు.

# ఏలూరుపై ప్రకృతి ప్రకోపం

- గాలి, వాన బీభత్సం
- విరిగిపడ్డ చెట్లు, విద్యుత్ స్తంభాలు
- భారీ వర్షానికి మునిగిన రోడ్లు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** భానుడి ప్రతాపం వల్ల ఉక్కబోతతో ఇబ్బందిపడిన ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఆదివారం వేకువజామున నిద్రలేచిన నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం శుభోదయం పలికింది. వేసవి ఉష్ణోగ్రతలతో వేడెక్కిపోయిన వాతావరణం ఉదయం లేచిన వారికి చల్లటి గాలి స్వాగతం పలికింది. మబ్బులతో కూడిన వాతావరణం ఉండడంతో ఉదయం 9 గంటల వరకూ హాయిగా గడిపిన నగర ప్రజలకు ప్రకృతి ప్రకోపం రు చిచూపింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకుని ఒక్కసారిగా భీకరమైన గాలి సుడులు తిరుగుతూ దుమ్మురేపింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారులకు అడ్డంగా పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు గాలిలోకి ఎగిరి, చిరిగి ప్రజల రాకపోకలకు విఘాతం కలిగించాయి.

**భారీ వర్షంతో ఇబ్బందులు**

అనంతరం గంట సేపు భారీ స్థాయిలో వర్షం పడి పల్లపు ప్రాంతాల్లో వాన నీరు చేరుకుని చెరువులను తలపించాయి. గంటకు పైగా నగరాన్ని అతలా కుతలం చేసిన అనంతరం ప్రకృతి శాంతించి సాధారణ స్థితికి చేరుకుంది. మధ్యాహ్నం 12 దాటిన తరువాత సూరీడు పలుకరించడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



వర్షంలో బాలింత అవస్థలు



వర్షంతో నిర్మానుష్యంగా మారిన ఒన్‌టౌన్ ప్రాంతం



గాలి ధాటికి చిరిగిన ఫ్లెక్సీ



వన్‌టౌన్ పోలీస్ క్వార్టర్స్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



భారీ వర్షంతో మునిగిన నగరంలోని ఒక వీధి



ఈదురుగాలులకు చెల్లాచెదురైన టెంట్, కుర్చీలు



కారుమబ్బులు కమ్ముకున్న ఆకాశం



మినీ బైపాస్‌లో చెట్టు కూలడంతో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

### శ్రీవారికి సింహవాహన సేవ



శ్రీవారికి సింహవాహన సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చక స్వాములు, ఆలయ అధికారులు, భక్తులు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠా మహా కుంభాభిషేకాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి సింహవాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. ఉదయం నిర్వహించిన కార్యక్రమాల్లో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీఏవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వెంకట పవన్ కృష్ణమాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

**ఉంగుటూరు:** నారాయణపురంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దంపతులు పీటలు మీద కూర్చుని పూజలు చేశారు. వేదపండితులు పెద్దింటి అనిల్‌కుమారాచార్యులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### హిందూ యువజన సంఘం నూతన కార్యవర్గాల ఎన్నిక



హిందూ యువజన సంఘం నూతనకార్యవర్గాలకు ఎన్నికైన సభ్యులు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** నగరానికి చెందిన ప్రతిష్టాత్మక సాంస్కృతిక, కళా సంస్థ హిందూ యువజన సంఘానికి యాజమాన్య, కార్యనిర్వాహక కమిటీల ఎన్నిక ఆదివారం నిర్వహించారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో హిందూయువజన సంఘం సర్వసభ్య సమావేశం ఎన్నికల అధికారి గురజాడ శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మేనేజ్మెంట్ కమిటీకి అధ్యక్షుడిగా యర్రా సోమలింగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కనిగోళ్ల కుమార్ గుప్తా, ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, వేమా కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కేవీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా సీహెచ్ సాయి తేజ, గుడిపాటి లలితా శర్మ ఎన్నికయ్యారు. అలాగే కార్యనిర్వాహక కమిటీకి అధ్యక్షుడిగా ఇరదల ముద్దుకృష్ణ, ఉపాధ్యక్షులుగా సంకు సురేష్, ఎల్. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మజ్జి సూర్యకాంతరావు, సహాయ కార్యదర్శులుగా కేబీ రావు, బొప్పన వెంకటరాజా తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికై న సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నిర్వహించిన సభలో మేనేజ్మెంట్ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా అంబికా రాజా, కార్యనిర్వాహక కమిటీకి గౌరవ అధ్యక్షులుగా జవ్వాజి మోహన్ విఠల్, సంస్థకు ప్రత్యేక ఆహ్వానితులుగా వేణుగోపాలునాని, వీవీ బాలకృష్ణారావులను, సర్వసభ్య సమావేశం నుంచి కొత్తగుండు శ్రీనివాసును మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడిగా సభ ఏకగ్రీవంగా ఎన్నుకొని వారి ఎన్నికను ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు. అనంతరం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన గురజాడ శ్రీకాంత్, సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కొచ్చర్లకోట వెంకట సుబ్బారావులను సత్కరించారు.

# సగరులను బీసీ-ఏలోకి మార్చాలి



భగీరథుని విగ్రహం వద్ద జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్న సగర సంఘం ప్రతినిధులు



భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న సగరుల అభివృద్ధి కోసం బీసీ -డీ నుంచి బీసీ-ఏకి రిజర్వేషన్ మార్చాలని ఏలూరు జిల్లా సగర సంఘం అధ్యక్షుడు కుప్పాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. వైశాఖ శుద్ధ సప్తమి పర్వదినం సందర్భంగా భగీరథ జయంతిని ఆదివారం స్థానిక ఫిరంగుల దిబ్బ ప్రాంతంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న భగీరథ విగ్రహం వద్ద ఆంజనేయులు ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భగీరథుని విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగరుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర అధ్యక్షుడు తాడిశెట్టి గోపిరావు, జిల్లా సగర యువజన అధ్యక్షుడు ఇబ్బా నాగేశ్వరరావు, రాష్ట్ర సగర న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి గండికోట సీతారామరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డి రాంబాబు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడు కే. ప్రసాద్ పాల్గొన్నారు.

**మాదేపల్లిలో..**

**దెందులూరు:** లక్ష్యసాధనకు మహర్షి భగీరథుని స్ఫూర్తిగా తీసుకోవాలని మాదేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాడిశెట్టి వెంకటరమణ అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో సగర్లపేటలో తాడిశెట్టి వెంకటరమణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహర్షి భగీరథ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గండికోట నాగరాజు సత్తెనపల్లి నరసింహారావు, కన్నయ్య,కృష్ణ పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 18 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 30 | చిక్కుడు కాయలు | 80 |
| వంకాయలు (కాంతులు) | 38 | బీన్లచిక్కుడు | -- |
| వంకాయలు (తెలుపు) | 34 | చామదుంపలు | 54 |
| బెండకాయలు | 30 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 32 | కంద | -- |
| కాకర కాయలు | 30-36 | బీట్‌రూట్ | 34 |
| బీరకాయలు | 30 | కీరా దోస | 36 |
| బీరకాయలు (పందిరి) | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 70 |
| క్యాబేజీ | 20 | అల్లం | 60 |
| క్యారెట్ | 36 | కొత్తిమీర (కట్ట) | 25 |
| దొండకాయలు | 22 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 32 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 24 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 38 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 20 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 60 |
| పొట్లకాయ(1) | 20 | చిలకదదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 11 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 26 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 24 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 00 |
| ఏలూరు - తిరుపతి | 19.00 | రద్దు |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 14 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 14 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 03 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 07 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 18 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 14 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 32 |

# ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** విద్యార్థులు తమ ఖాళీ సమయాలను గ్రంథాలయాల్లో గడపడం ద్వారా మంచి విజ్ఞానవంతులుగా తమ నుతాము తీర్చిదిద్దుకోవాలని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్, జిల్లా రచయితల సంఘం కార్యదర్శి నాగాస్త్ర సూచించారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగాస్త్ర మాట్లాడుతూ విద్యార్థులంతా గ్రంథాలయంలో సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముస్తాఫా ఆలీ మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠశాలల్లో అకడమిక్ పుస్తకాలతో పాటుగా గ్రంథాలయానికి వచ్చి ఇక్కడ పుస్తకాలు కూడా చదవాలన్నారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించగా రీసోర్స్‌పర్సన్ డి. శ్రీవల్లి విద్యార్థులకు యోగా క్లాసులు చెప్పి నీతి కథలు చదివించారు. నృత్యకళాకారుడు వై.ఫణి కాంత్ విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కమార్, ఎండీ అస్లాం బాషా, బీవీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

**ఉంగుటూరు:** ఆరుగాల కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ వింగ్ కమిటీ కార్యదర్శి, ఏలూరు జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు యెలిశెట్టి పాపారావు బాబ్జి అన్నారు. ఆదివారం కురిసిన అకాల వర్షంతో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆయన మాట్లాడారు. టార్గెట్లు సకాలంలో ఇవ్వకపోవడంతో ఉంగుటూరు మండలంలో 20 వేల మెట్రిక్ టన్నులు తడిసిపోయిందన్నారు. అమరావతి పున: నిర్మాణ సందర్భంగా ప్రధాని మోదీ భజనలో మునిగిన కూటమి ప్రభుత్వం, రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు సుమారు పది రోజుల నుంచి ధాన్యం సంచుల్లో పట్టి నెట్లు వేసుకుని లారీల కోసం ఎదురు చూస్తుంటే టార్గెట్లు అయిపోయాయని, మీరు బహిరంగ మార్కెట్లులో అమ్ముకోండి అని అధికారులు చెబుతుండడం దారుణమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తే కూటమి ప్రభుత్వం టార్గెట్ల పేరుతో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. తక్షణమే ధాన్యం మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేకుంటే రైతులకు మద్దతు నిరసనలు చేపడతామని హెచ్చరించారు.



తడిసిన ధాన్యం బస్తాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు

# వ్యవసాయ క్షేత్రాల్లో ఆర్డీఓ పర్యటన

**జంగారెడ్డిగూడెం:** వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తమ పంటలను సంరక్షించుకోవాలని ఆర్డీవో ఎంవీ రమణ అన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కోతలు కోయాల్సిన పంటలతో పాటు, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకోవాలని ఆర్డీవో సూచించారు. అలాగే ధాన్యం తడవకుండా ధాన్యం రాశులతో పాటు, బస్తాల్లో ఉన్న వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, బరకాలు కప్పడం ద్వారా రక్షించుకోవచ్చన్నారు. ధాన్యాన్ని తరలించేందుకు లారీలు ఏర్పాటు చేస్తామని, అలాగే రైతులకు అవసరమైన గోనె సంచులను సైతం సిద్ధం చేస్తామని తెలిపారు. ఆదివారం జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం, కొయ్యలగూడెం మండలం గంగవరం గ్రామాల్లో ఆర్డీవో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలో కళ్లాల మీద 3 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెప్పారు.

### ప్రశాంతంగా నీట్ పరీక్షలు

**దెందులూరు:** గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయం ఉన్నత పాఠశాలలో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 240 మంది విద్యార్థులకు గాను 235 మంది పరీక్షకు హాజరుకాగా ఐదుగురు గైర్హాజరైనట్లు స్పెషల్ ఆఫీసర్, దెందులూరు తహశీల్దార్ సుమతి తెలిపారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో 114 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజరయ్యారని స్పెషల్ ఆఫీసర్ పెదవేగి తహశీల్దార్ భ్రమరాంబ తెలిపారు.

### ధాన్యం కొనుగోలు చేయకుంటే ఎలా?

**దెందులూరు:** ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తికావడంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనటం లేదని చెబుతుండడంపై రైతు, సానిగూడెం గ్రామ సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన విలేకరులకు చూపించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల నుంచి ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయించారని, కానీ కూటమి ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అకాల వర్షాల తమ పాలిట శాపంగా మారితే, మరోపక్క కూటమి ప్రభుత్వం టార్గెట్ పేరిట రైతులకు నరకం చూపిస్తున్నారని మండిపడ్డారు.



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు విష్ణు